సాక్షి
మంచిర్యాల
సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024

గరిష్టం/కనిష్టం
33.1 /22.2
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేకువ జామున చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.





సల్లంగ సూడమ్మా..

మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారిఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న మైసమ్మ జాతర ఆదివారం పెద్ద పూజతో ముగిసింది. మైసమ్మ దర్శనానికి ఆదివాసీ నాయక్‌పోడ్‌లు భారీగా తరలివచ్చారు గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధి చేశారు. మైసమ్మతల్లికి పట్నాలు వేశారు. అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. నైవేద్యం సమర్పించి అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. - 8లో▸

న్యూస్‌రీల్

రామగుండం పోలీస్ కమిషనర్‌కు పదోన్నతి



సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులుకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 మంది ఐపీఎస్‌లకు పదోన్నతి కల్పించారు. ఇందులో భాగంగా 2006 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసులు ఈనెల 14న రామగుండం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి లభించినప్పటికీ ప్రస్తుతం ఉన్న హోదాలోనే విధులు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గూడెంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో అధికారులు, అర్చకులు..

దండేపల్లి: మంచిర్యాల జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 18న ప్రారంభం అయిన స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం రథోత్సవంతో ముగిశాయి. ముగింపులో భాగంగా స్వామివారికి చక్రస్నానం, ఏకాంతసేవ నిర్వహించారు. అనంతరం సప్తాహ భజనలు పరిసమాప్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రఘుస్వామి, సంపత్ స్వామి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

దండేపల్లి: మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల లక్ష్మీనారాయణ సూచించారు. మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమావేశం దండేపల్లిలో ఆదివారం నిర్వహించారు. సంఘం పటిష్టతకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం దండేపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అన్నం సత్యనారాయణ, అధ్యక్షుడిగా బొలిశెట్టి రాజన్న, ఉపాధ్యక్షులుగా అప్పాల మనోహర్, మొర్పుటాల తిరుపతి, గాండ్ల గణేశ్, ప్రధాన కార్యదర్శిగా పోలంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కుంచె కిషన్, సలహాదారులుగా గంగన్న, సుగుణాకర్, శేఖర్, సంయుక్త కార్యదర్శిగా నాగన్న, రవి, గణేశ్ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండు జనార్దన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొలిశెట్టి బుచ్చన్న పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా అర్జున్‌కుమార్



మహంత్ అర్జున్‌కుమార్

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మందమర్రి పట్టణానికి చెందిన మహంత్ అర్జున్‌కుమార్‌ను నియమిస్తూ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా అర్జున్ సమర్థవంతంగా బాధ్యలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కేశవరెడ్డితోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న 'కడెం' మరమ్మతులు



కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. నూతన ప్రాజెక్ట్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై గతంలో ఢిల్లీ బృందం సూచించిన ప్రాంతాల్లో డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. - 8లో▸

కాగితాల్లోనే మురికినీటి శుద్ధి!



రాముని చెరువు నిండా ఉన్న డ్రెయినేజీ నీరు

- మురికి నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- నేరుగా చెరువులోకి చేరుతున్న డ్రెయినేజీ నీరు
- రాళ్లవాగులో కలిసి గోదావరిలోకి చేరుతున్న వైనం

మంచిర్యాలటౌన్: నదులు, చెరువుల్లోకి మురికి నీరు చేరకుండా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.Oలో భాగంగా గతేడాది మున్సిపాలిటీలతోపాటు, గోదావరి నదికి సమీపంలో ఉన్న పట్టణాల్లో మురికినీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ) నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని రాముని చెరువులో కలిసే మురికినీటిని శుద్ధి చేసేందుకు జాఫర్‌నగర్ నుంచి రాముని చెరువుకు వెళ్లే డ్రెయినేజీపై, హైటెక్‌సిటీ కాలనీ నుంచి రాముని చెరువులోకి నేరుగా కలుస్తున్న మురుగు నీటి కాలువపై ఎస్టీపీలు నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు స్థలం కూడా ఎంపిక చేశారు. ఇందుకు ఒక్కో ఎస్టీపీ నిర్మాణానికి రూ.2.80 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా వాటికి కేంద్రం ఆమోదం తెలిపింది. నస్పూరు, లక్సెట్టిపేట మున్సిపాలిటీల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకుంది.

విడుదల కాని నిధులు..



జాఫర్‌నగర్ కాలువ నుంచి రాముని చెరువులోకి వదిలిన డ్రెయినేజీ నీరు

ఏడాది దాటినా.. ఎస్టీపీలకు కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదు. దీంతో గోదావరి పరీవాహక పట్టణాలైన మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట పట్టణాల డ్రెయినేజీ నీరు కాలువల ద్వారా నేరుగా నదిలో కలుస్తోంది. పవిత్రంగా, స్వచ్ఛంగా ఉండాల్సిన గోదావరి మురికి కూపంగా మారుతోంది. జిల్లా అంతటికీ తాగునీరు అందిస్తున్న గోదావరిలో డ్రెయినేజీ కలవడం ద్వారా ప్రమాదకర రసాయనాలు చేరుతున్నాయని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

నేరుగా వాగులోకే...

జిల్లా కేంద్రంలో 1.50 లక్షలకుపైగా జనాభా ఉంది. పట్టణంలోని ఇళ్ల నుంచి బయటకు వచ్చే డ్రెయినేజీ నీరంతా పట్టణంలో ఉన్న చెరువులు, వాగుల్లోకి చేరుతోంది. దీంతో స్వచ్ఛమైన చెరువులు, పట్టణ శివారులోని వాగులు మురికి కూపంలా మారుతున్నాయి. హమాలీవాడ, చున్నంబట్టి వాడ, గాంధీనగర్, తిలక్‌నగర్ నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు నేరుగా సాయికుంట చెరువులోకి చేరుతోంది. అక్కడి నుంచి గోదావరిలో కలుస్తోంది. ఇక జన్మభూమినగర్‌లోని రాముని చెరువులోకి హైటెక్‌సిటీ డ్రెయినేజీ నీరు చేరి, అక్కడి నుంచి రాళ్లవాగు ద్వారా నేరుగా గోదావరిలో కలుస్తోంది.

నిరుపయోగంగా పాత ప్లాంట్లు..

మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని డ్రెయినేజీ నీటిని శుద్ధిచేసి రాళ్లవాగులోకి పంపించేందుకు 17 ఏళ్ల క్రితం పట్టణంలోని రెడ్డికాలనీలో 10 గుంటల స్థలంలో ఎస్టీపీ ఏర్పాటు చేశారు. రెండేళ్లకే ఆ ప్లాంటు మూతపడింది. దీంతో పట్టణంలోని మురికి నీరు నేరుగా చెరువులు, వాగుల్లోకి చేరుతోంది. మున్సిపల్ అధికారులు డ్రెయినేజీ నీరు చెరువులు, వాగుల్లోకి వెళ్లేందుకు కాలువలు కూడా నిర్మించడం గమనార్హం. రాంనగర్, సాయికుంటలోని మురికి నీటిశుద్ధి ప్లాంట్లదీ అదే పరిస్థితి. ఇవేవీ పనిచేయక డ్రెయినేజీ నీరు నేరుగా చెరువులు, వాగుల్లోకి చేరుతోంది.

కార్యరూపం దాల్చని కొత్త ప్లాంట్లు..

నాలుగేళ్ల క్రితం మున్సిపల్ ఆధ్వర్యంలో నీటిశుద్ధి ప్లాంట్లు కొత్తగా నిర్మించేందుకు రూ.3 కోట్లు కేటాయించారు. అయితే అవి చాలకపోవడంతో వాటిని రద్దు చేశారు. తర్వాత టీఎండీసీ నిధులతోపాటు స్టార్మ్ వాటర్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సెంట్రల్ వర్క్ నిధులతో నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. పట్టణ ప్రగతి నిధులతో రాముని చెరువులోకి మురికి నీరు చేరకుండా ఉండేలా రూ.2.80 కోట్లతో రెండు ఎస్టీపీ ప్లాంట్లను నిర్మించేందుకు నిధులను కేటాయించగా, కేంద్రం ఎస్టీపీల నిర్మాణానికి పబ్లిక్ హెల్త్ వారికి బాధ్యతలను అప్పగించడంతో మున్సిపల్ అధికారులు తప్పుకున్నారు. ఏడాదిన్నర కావొస్తున్నా కేంద్రం ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

స్థలాలను గుర్తించాం...

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో రెండు ఎస్టీపీ(సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణం కోసం గతేడాది రెండు చోట్ల స్థలాలను గుర్తించి, ఒక్కో ప్లాంట్ నిర్మాణం కోసం రూ.2.80 కోట్ల నిధులతో ప్రతిపాదనలు పంపించాం. కేంద్రం సూచనలతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నూతనంగా ఎస్టీపీల నిర్మాణానికి స్థలాలను కూడా గుర్తించాం. అనుమతులు, నిధులు వస్తే పనులు చేపడతాం.

– శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ డీఈ, మంచిర్యాల

అంతరిస్తున్న అడవికి జీవం



నర్సరీలో ఎదుగుతున్న మొక్కలు

- అరుదైన మొక్కలను పెంచుతున్న అటవీశాఖ
- నర్సరీల్లో ప్రత్యేక చర్యలు
- జూలైలో అడవిలోనాటేందుకు ప్రణాళిక

బెల్లంపల్లి: అడవులకు పూర్వ వైభవం తీసుకురావడానికి అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటవీ భూభాగం ఖాళీగా ఉండకుండా అంతరించి పోతున్న వృక్షజాతి మొక్కలను తిరిగి నాటడానికి జిల్లా అటవీశాఖ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. బెల్లంపల్లి కేంద్రంగా ప్రత్యేక నర్సరీ ఏర్పాటు చేసి అంతరించిపోయే మొక్కలను పెంచుతోంది. వచ్చే వానాకాలంలో బెల్లంపల్లి డివిజన్ పరిధిలో వీటిని నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

50 వేల మొక్కల పెంపకం..

బెల్లంపల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి 2 కిలోమీటర్ల దూరంలో కుంటరాములు బస్తీ శివారులో నర్సరీ నిర్వహిస్తున్నారు. ఈ నర్సరీలో డివిజన్ వ్యాప్తంగా నాటేందుకు 50 వేల మొక్కలు పెంచుతున్నారు. ప్రత్యేకంగా బెడ్స్ ఏర్పాటు చేసి పలురకాల విత్తనాలు పాలిథిన్ కవర్లలో ఉంచి విత్తుకునేలా చేశారు. ప్రస్తుతం ఒక్కో మొక్క 6 ఇంచుల వరకు ఎదిగాయి. కూలీలతో నిత్యం మొక్కలకు నీరు అందిస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. రాబోయే వేసవిలో మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్ ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

అంతరిస్తున్న మొక్కలకు ప్రాధాన్యం..

గతంతో పోలిస్తే ప్రస్తుతం అటవీ సంపద కాస్త వృద్ధి చెందింది. అడవుల్లో జన సంచారాన్ని నియంత్రించి, వృక్షాలు నరికి వేయకుండా పకడ్బందీ చర్యలు చేపట్టడంతో వనాలు ఏపుగా పెరుగుతున్నాయి. అయితే దశాబ్దం క్రితం వరకు వంట చెరుకు కోసం, ఇళ్ల నిర్మాణానికి వృక్షాలను నరికివేశారు. దీంతో అరుదైన జాతి వృక్షాలు అంతరించిపోయాయి. ఇప్పటికీ చాలా అటవీ భూభాగం ఖాళీగా ఉంది.

మొక్కలు ఎదుగుతున్నాయి..

నర్సరీలో అరుదైన, అంతరించి పోతున్న వృక్ష జాతుల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. అల్ల నేరేడు వంటి పండ్ల మొక్కలను కూడా పెంచుతున్నాం. రోజువారీగా మొక్కల సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా 24 రకాల మొక్కలను పెంచి వచ్చే జులైలో అటవీ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశాల్లో నాటిస్తాం. ఆయా రకాల మొక్కలు పెరిగి వృక్షాలుగా ఎదిగేలా సంరక్షిస్తాం.

– గౌరీ శంకర్, డెప్యూటీ రేంజ్ అధికారి, బెల్లంపల్లి

ఈ నేపథ్యంలో అంతరించిపోయిన, అంతరించిపోయే దశలో ఉన్న జాతి మొక్కలను తిరిగి పెంచేలా ప్రాధాన్యం ఇస్తున్నారు. నర్సరీలో అలాంటి మొక్కలనే పెంచుతున్నారు.

24 రకాల మొక్కలు..

అంతరించిపోతున్న 24 రకాల మొక్కలను ప్రస్తుతం నర్సరీలో పెంచుతున్నారు. ఇందుకు మహా వృక్షాలుగా ఎదిగి అడవికే అందాన్ని తెచ్చే వృక్ష జాతులను అటవీ అధికారులు గుర్తించారు. ఇలాంటి వాటిలో నల్ల మద్ది, జిట్రేగి, రావి, నారాప, కొడిపె, బూరుగు, మర్రి తదితర జాతుల వృక్షాలకు జీవం పోయడానికి అటవీ శాఖ చేస్తున్న కృషి సత్ఫలితాలిస్తోంది. ఆయా రకాల విత్తనాలను సేకరించి విత్తుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. అరుదైన రకాలతో పాటు ఫలసాయాన్నిచ్చే అల్లనేరేడు మొక్కలను పెంచి అటవీ సంపదను పెంచాలని చూస్తున్నారు.

నేటి నుంచి అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్షలు

బెల్లంపల్లి: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఐదో సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డిగ్రీ కళాశాల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రంలో చదువుతున్న ఐదో సెమిస్టర్ విద్యార్థులు విధిగా పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

తరగతుల వేళలు మార్పు..

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో రెగ్యులర్ తరగతుల వేళలు మార్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు, బోధన సిబ్బంది మారిన సమయపాలనను అనుసరించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు..
- పరీక్ష రాయనున్న విద్యార్థులు 15529
- భయం తొలగించేందుకు టోల్‌ఫ్రీ నంబర్లు 14416, 1800914416
- సందేహాల నివృత్తికి కంట్రోల్‌రూం నం.. 6281957047
- జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శైలజ



డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నెల 28 నుంచి మార్చి 16 వరకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణపై కలెక్టర్ బాదవత్ సంతోష్ వైద్యం, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, బీఎస్ఎన్ఎల్, విద్యాశాఖ సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఈమేరకు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శైలజ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ అమలు చేశామని, పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మూడు రోజుల్లో ప్రారంభమయ్యే పరీక్షల ఏర్పాట్ల గురించి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు తెలిపారు.

సాక్షి : జిల్లాలో పరీక్షలకు ఎంతమంది హాజరుకానున్నారు?

డీఐఈవో: జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. మొత్తం 15,529 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 8,394 మంది సెకండియర్ విద్యార్థులు 7,135 మంది పరీక్ష రాయనున్నారు.

సాక్షి : పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

డీఐఈవో: ప్రతీ కేంద్రంలో తాగునీటి వసతితోపాటు వెలుతురు సరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇంటర్నెట్, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని బీఎస్ఎన్ఎల్, విద్యుత్‌శాఖ అధికారులకు సూచించాం. ఏఎన్ఎంలు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో అందుబాటులో ఉంటారు. విద్యార్థులు కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

సాక్షి : పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బంది పనిచేస్తారు?

డీఐఈవో: ఇంటర్ పరీక్షల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా, డీఐ ఈవో(నేను) కన్వీనర్‌గా వ్యవహరిస్తాం. 25 మంది చీఫ్ సూపరిటెండెంట్లు, 25 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు విధులు నిర్వహిస్తారు. 520 మంది ఇన్విజిలేటర్లతోపాటు ఫ్లయింగ్‌స్క్వాడ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్‌లుఏర్పాటు చేశాం.

సాక్షి : మాస్ కాపీయింగ్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో: పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. అనుమానం ఉన్న ప్రతీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తాం. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రభుత్వ కళాశాలలకు చెందిన వారినే నియమించాం. అవసరమైతే ఉపాధ్యాయులను కూడా ఇన్విజిలేటర్లుగా తీసుకుంటాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. 100 మీటర్ల వరకు జిరాక్స్ సెంటర్లు పరీక్ష వేళలో మూసివేయిస్తాం. కాపీయింగ్‌ను ప్రోత్సహించే అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

సాక్షి : మెరుగైన ఉత్తీర్ణతకు చేపట్టిన ప్రణాళిక ఏమిటి..?

డీఐఈవో: గతేడాది ప్రథమ సంవత్సరంలో 82.79 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈఏడాది మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు, మాదిరి పరీక్షలు నిర్వహిస్తున్నాం. మూడు మోడల్ పేపర్లు అందించాం. లెక్చరర్లు ప్రత్యేకంగా రూపొందించిన మోడల్ పేపర్లతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం.

సాక్షి : హాల్‌టికెట్లపై విద్యార్థులకు ఇచ్చే సూచనలు ఏమిటి?

డీఐఈవో: విద్యార్థులు హాల్‌టికెట్ రాలేదని ఆందోళన చెందవద్దు. కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుంటే బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దానితో పరీక్ష రాయవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం లేదని ఆందోళన చెందొద్దు.

సాక్షి : మానసిక ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకున్నారా?

డీఐఈవో: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా, మానసికంగా భయం తొలగించేందుకు టోల్‌ఫ్రీ నంబర్లు 14416, 1800914416 సంప్రదిస్తే మానసిక వైద్య నిపుణులు సలహాలు ఇస్తారు. పరీక్షలు, హాల్‌టికెట్‌పై ఉన్న సందేహాల నివృత్తి కోసం కంట్రోల్‌రూం ఏర్పాటు చేశాం. 6281957047 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

- టీఎస్‌యూటీఎఫ్ కార్యదర్శి వెంకట్



మాట్లాడుతున్న వెంకట్

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, పదోన్నతులకు ఉన్న ఆటంకం తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ కోరారు. మంచిర్యాలలో ఆదివారం యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వెంకట్ మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు మంజూరు చేయాలన్నారు. సీపీఎస్ విధానం రద్దుచేయాలని కోరారు. కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు, గిరిజన, సంక్షేమ, సాంఘిక, మైనార్టీ, బీసీ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గెస్ట్ తదితర సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాలలనే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు, ఉపాధ్యక్షుడు చక్రపాణి, లావణ్య, కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు నర్సయ్య, చంద్రమౌళి, సంతోష్‌కుమార్, కిరణ్ తదితరులుపాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్లకు నేడు శంకుస్థాపన



ప్రారంభోత్సవాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేసిన దృశ్యం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

మంచిర్యాలక్రైం: రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం పేరుతో(ఆర్‌బీఎస్ఎస్) రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను కూడా ఎంపిక చేసింది. ఈ పనులను ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఉదయం 10 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈమేరకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు రెండు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, రైల్వే అధికారులు హాజరుకానున్నారు.

కన్నాల రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ శివారు కన్నాల రైల్వే అండర్ బ్రిడ్జిని సోమవారం ఉదయం 11 గంటలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి పాల్గొంటారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొన్న సంఘటనలో శేషపల్లి గ్రామానికి చెందిన కుర్మ కుమార్ (36) మృతిచెందాడు. మంచిర్యాల రైల్వేహెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. గద్దెరాగిడి నుంచి కుర్మ కుమార్ కాలినడకన ఇంటికి వెళ్తున్నాడు. కొత్త బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్టు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కత్తెరసాల సమీపంలో శనివారం బోలెరో వాహనం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో కంకణాల దేవేందర్‌రెడ్డి, ఎండీ సైఫ్ అలీ మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న ఎండీ ఆబిద్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతున్నాడు. మృతుడు దేవేందర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం తాగి బోలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన కోటపల్లి మండలం పారిపల్లి వాసి గడల తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్సెట్టిపేట మండలం గుల్లకోటకు చెందిన గుర్రాల శ్రీధర్‌రెడ్డి (45) బైక్‌పై మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న ఆటోను బైక్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌రెడ్డి తలకు తీవ్రగాయాలు కాగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. హాజీపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌తోపాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా, ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ ముత్యాలమ్మ మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, అప్పారావుపేట్, శివుని, మలక్‌జాం, హిమాయత్‌నగర్, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. చిన్నపిల్లలకు తులాభారం, తలానీలాలు అర్పించి మొక్కు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ గ్రామానికి చెందిన గాజుల గోదావరి.. అమ్మవారికి రెండు తులాల వెండిని బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు.

సల్లంగ సూడమ్మా..

- ముగిసిన గాంధారి మైసమ్మ జాతర
- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు


ఖిల్లాలోని దర్వాజ వద్ద బారులు తీరిన భక్తులు


కాలభైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి మైసమ్మ జాతర ఆదివారం పెద్దపూజతో వైభవంగా ముగిసింది. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వేలాదిగా తరలివచ్చారు. జాతరలో చివరిరోజైన ఆదివారం తెల్లవారుజాము గాంధారీ ఖిల్లా దిగువ భాగంలో ఉన్న జీడికోట నుంచి మైసమ్మతల్లి వద్దకు ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగుళ్ల ఆటలతో, డప్పుచప్పుళ్లతో చేరుకున్నారు. అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధిచేసి మైసమ్మతల్లి వద్ద పట్నాలు వేశారు. తర్వాత నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ జాతరలో పాల్గొనేందుకు జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీ నాయక్‌పోడ్‌లు, భక్తులు తరలివచ్చారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

గాంధారి ఖిల్లా ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మూడు రోజుల జాతరలో ముగింపు ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఖిల్లాపైకి వచ్చి కాలభైరవుడి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర నిర్వహణకు కలెక్టర్‌తో మాట్లాడి రూ.5 లక్షలు ఇప్పించానని అన్నారు. ఖిల్లాలో వెలిసిన మైసమ్మ తల్లి గొప్ప శక్తి స్వరూపిని అని, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేకరాష్ట్రం రావాలని ఆనాడు అమ్మవారిని మొక్కుకున్నానని గుర్తుచేశారు. ఖిల్లా వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతులు అవసరమని ఇందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ట్రైబల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని, గాంధారి ఖిల్లాలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని చేపడుతామన్నారు. అనంతరం నాయక్‌పోడ్‌లు ఎమ్మెల్యేకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, నాయక్‌పోడ్ సేవాసమితి నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిని అందిస్తున్న నాయకులు


మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

అధ్వానంగా సింగరేణి గార్డెన్


నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్

- నిర్వహణ అస్తవ్యస్తం
- పగిలిపోయిన టైల్స్
- పేరుకే ఏసీ హాల్
- పట్టించుకోని అధికారులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్ నిర్వాహణ అధ్వానంగా మారింది. కార్మిక కుటుంబాలు వివాహాది, శుభాకార్యాలు చేసుకోవడానికి శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఏకైక ఏసీ ఫంక్షన్ హాల్ ఇదొక్కటే ఉంది. ఐతే దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో శుభకార్యాలు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దీన్ని ఓల్డ్ కమ్యూనిటీహాల్ అనేవారు. మూడేళ్ల క్రితం ఇందులో ఏసీలు, టైల్స్ పెట్టి ఇతర హంగు ఆర్భాటాలతో ఆధునీకరించారు. ఇంత చేసిన నిర్వహణను గాలికి వదిలేశారు. హాల్‌లో ఉన్న ఏసీలు కొన్ని పనిచేయడం లేదు. పని చేస్తున్న ఏసీల రిమోట్‌లు మాత్రం జీఎం కార్యాలయంలోనే ఉంటాయి. వాటిని ఆన్‌చేస్తే ఒక్కో ఏసీ ఒక్కో టెంపరేచర్ మీద రన్ అవుతున్నాయి. రిమోట్లు అందుబాటులో లేకపోవడంతో చల్లదనం సరిపడా రావడం లేదు. స్టేజీపై ఉన్న కొన్నిటైల్స్ పగిలిపోయాయి. దీంతో వేదికపై వచ్చి వెళ్లేవారికి కాళ్లకు గాయాలవుతున్నాయి. దీనికితోడు కొన్ని లైట్లు పనిచేయడం లేదు.


పాకురుతో ఉన్న మంచినీటి ట్యాంక్

మురికి పట్టిన డైనింగ్ హాల్..

డైనింగ్ హాల్ అయితే మరింత అధ్వానంగా ఉంది. ఫ్లోర్ సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో మురికిపట్టి నల్లగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. కిచెన్ ఏరియాలో వంట సామగ్రి, ప్లేట్లు కడుక్కోవడానికి ఉన్న మంచినీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉంది. అందులో చెత్తాచెదారం, పాకురు, ప్లాస్టిక్‌పైపులు అధ్వానంగా మారింది. ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి నీటిని తోడితే అందులో పురుగులు వస్తున్నాయని వంట మనుషులు పేర్కొంటున్నారు. డైనింగ్ సెక్షన్ షెడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో వేసవిలో వేడి, తీవ్ర ఉక్కపోతతో శుభకార్యాలకు హాజరైనవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన దీని నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

- నేడు యూబీఐతో సింగరేణి యాజమాన్యం ఒప్పందం

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగి ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో కాని, బయట గాని మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో యూబీఐతో ఒప్పందం చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి చెల్లించాల్సిందేనని పలు దఫాలుగా చేపట్టిన ఆందోళనల ఫలితంగా యూబీఐ అంగీకరించిందని తెలిపారు. ఉద్యోగి ప్రతిఏటా రూ.274 అదనంగా చెల్లిస్తే మరో రూ.30 లక్షలు చెల్లించడానికి అంగీకరించారని సీతారామయ్య వివరించారు. సింగరేణి ఉద్యోగులు వివిధ బ్యాంకుల్లో ఖాతాదారులుగా ఉన్నారని తెలిపారు. యూబీఐ మాదిరిగా మిగతా బ్యాంకులు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని లేకపోతే యూబీఐకి వేతనాలు బదిలీ చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే..

కాసిపేట: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూబీఐ అంగీకరించిందని బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య బ్యాంకు అధికారులతో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. ఇతర బ్యాంకులు సైతం ఇదే విధంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు

నల్లగొండ: నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లా సెపక్‌తక్రా చాంపియన్ షిప్‌పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారని అన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

జూనియర్ బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్–నిజామాబాద్ జట్లు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జట్టుకు 3 బంగారు పతకాలు, నిజామాబాద్‌కు ఒక బంగారు పతకం, ఒక రజతం, ఒక కాంస్యం లభించింది. నల్లగొండ జట్టు ఒక రజతం , ఒక కాంస్యం సాధించింది. ఆదిలాబాద్ ఒక రజతం, ఒక కాంస్యంతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. హైదరాబాద్, వరంగల్ జట్లు చెరో రెండు కాంస్య పతకాలను సాధించగా, మహబూబ్‌నగర్ ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది.



పతకాలతో ఆదిలాబాద్ బాలుర జట్టు క్రీడాకారులు


విజేతలతో బాలుర క్రీడాకారులు

కళ్లకు గంతలతో బైక్‌లపై అయోధ్యకు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన మెజీషియన్లు మారుతిజోషి, రామకృష్ణ కళ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు బైక్‌లపై యాత్ర చేస్తున్నారు. ఆదివారం ఈ యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకోగా వారిని ఎంపీ సోయం బాపూరావు సన్మానించారు. స్థానిక శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి పూలమాల, శాలువలతో సత్కరించారు. యాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సురక్షితంగా అయోధ్యకు చేరుకుని బాలరాముని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూసిన అయోధ్య భవ్య రామమందిర నిర్మాణ కలను ప్రధాని మోదీ సాకారం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు స్వాములు తదితరులు పాల్గొన్నారు.


యాత్రికులను సన్మానిస్తున్న ఎంపీ సోయం

రక్తకణాలు తగ్గి మహిళ మృతి

లక్ష్మణచాంద: రక్తకణాలు తగ్గి మహిళ మృతి చెందింది. మండలంలోని చామన్‌పెల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమ్మోజి లక్ష్మి(42)కి శనివారం జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేయగా రక్తకణాలు తగ్గాయని ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని తెలిపారు. రాత్రి ఆమెకు ప్లేట్‌లెట్స్ ఎక్కించినా పెరగకపోవడంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త శంకర్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదృశ్యమైన యువతి.. బావిలో శవమై..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెంచికల్‌పేట్: గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన గుండెపల్లి గ్రామానికి చెందిన యువతి తలండి నిర్మల(26) వ్యవసాయ బావిలో ఆదివారం శవమై తేలింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గుండెపల్లికి చెందిన నారాయణ–వెంకుబాయి దంపతుల కుమార్తె నిర్మల బెజ్జూర్ మండలంలోని కోయపెల్లికి చెందిన రవికుమార్ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం ఇంటి నుంచి నిర్మల అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావి సమీపంలో రక్తపు మరకలు, చెప్పులు చూసిన కుటుంబీకులు గ్రామస్తుల సహాయంతో బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, పెంచికల్‌పేట్ ఎస్సై కొముర‌య్యలు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రేమించిన యువకుడే నిర్మలను హత్య చేసి బావిలో పడేసినట్లు మృతురాలి తండ్రి ఆరోపించారు. అతని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని గుడిపేట వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రో డ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యా యి. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం..గుడిపేటకు చెందిన దొరిశెట్టి రాజయ్య తన బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటి వస్తున్నాడు. లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొంది. రాజయ్యకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మె రుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవే ట్ ఆస్పత్రికి పంపించారు. రాజయ్యకు వరుస సోదరుడు సూర్యప్రకాశ్ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి గాయాలు

నిర్మల్: సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాలోజీ గ్రామానికి చెందిన రేయిండ్ల సాయినాథ్(40) బైక్‌పై అడెల్లిలోని తన బంధువుల శుభకార్యానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో అడెల్లి చేరుకోగానే గుర్తుతెలియని ఆటో బైక్‌ను ఢీకొట్టింది. సాయినాథ్ కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా క్రీడాకారులు

నేరడిగొండ: జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గోల్డ్‌మెడల్ సాధించారు. బిహార్ రాష్ట్రం పట్నాలో ఈనెల 21 నుంచి 25 వరకు 41వ జూనియర్ జాతీ యస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 23–24 బాల,బాలికలు పాల్గొన్నారు. ఫైనల్‌లో తెలంగాణ, కేరళ జట్లు తలపడ్డాయి. కేరళ జట్టుపై ఒక రన్ తేడాతో విజయం సాధించారు. ఆదిలాబాద్ జిల్లా బాలుర నుంచి అఖిల్, బాలికల నుంచి డి.శిరీష, ఎం.అలేఖ్య, బి.వనిత నేరడిగొండ క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తోపాటు, ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా ఎస్‌ఐఎస్ కోచ్ ఓ.అఖిల, అసోసియేషన్ సభ్యులు, జిల్లా పేట అధ్యక్ష, కార్యదర్శులు వారిని అభినందించారు.

రెండోరోజూ టీసీసీ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష రెండోరోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాకేంద్రంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో డ్రాయింగ్ లోయర్, హైయర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 513 మందికి గాను 367 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 513 మందికి గాను 366 మంది హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ దామోదర్‌రావు పరిశీలించారు.

గోదావరి తీరంలో స్వచ్ఛభారత్

భైంసా: బాసర గోదావరి నదితీరంలో సంత్ నిరాకారి నిజామాబాద్ శాఖ సంయోజక్ లక్ష్మణ్ నేతృత్వంలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. సభ్యులంతా గోదావరి నది పరీ వాహక ప్రాంతాల్లో, స్నానఘట్టాల వద్ద చెత్తను తొలగించారు. దశరథ మహరాజ్ ఆశ్రమ పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. 100 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కలదాడిలో చిన్నారులకు గాయాలు

తానూరు:మండలంలోని తొండాల గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. చిన్నారులు ఆడుకుంటుండగా ఆదిత్య, సాయినాథ్, విలాస్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చింది. కుటుంబీకులు వారిని ధర్మాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో బుద్ద ప్రకాశ్‌కు చెందిన ఇల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుద్ద ప్రకాశ్ ఉపాధి నిమిత్తం దక్షిణాఫ్రికాలో మెల్ట్ కంపెనీలో అకౌంటెట్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. గతనెల క్రితం సమీప బంధువుల వివాహం నిమిత్తం గ్రామానికి వచ్చాడు. శనివారం పాలోది గ్రామంలో జాతరకు వెళ్లి వచ్చాడు. రాత్రి ఇంట్లో కుటుంబీకులు, అతను నిద్రకు ఉపక్రమించారు. రాత్రి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వస్తువులు టీవీ, బీరువాతోపాటు తదితర ఫర్నిచర్ వస్తువులు, రూ.1.22 లక్షల నగదు, సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. తాంసి ఎస్సై శివరాం ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.


కాలిపోయిన ఇంటిని చూపుతున్న ప్రకాశ్

కొనసాగుతున్న ‘కడెం’ మరమ్మతులు


గేజ్ రూం సమీపంలో డ్రిల్లింగ్ పనులు


గుంత పూడ్చుతున్న పొక్లెయిన్

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. భారీ వరదలకు దెబ్బతిన్న స్పిల్‌వే కింది ప్రాంతాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో ఎడమ కాలువ వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని మొరంతో పూడ్చారు. నూతన ప్రాజెక్ట్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై గతంలో ఢిల్లీ బృందం సూచించిన ప్రాంతాల్లో డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో విడుదలైన రూ.కోటి నిధులతో మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

నేడు సమీక్షా సమావేశం

కడెం ప్రాజెక్ట్ మరమ్మతులపై ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, మెకానికల్ టీం, ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ప్రాజెక్ట్ స్థితిగతులపై పూర్తి రిపోర్ట్‌ను అందించనున్నట్లు డీఈ బోజదాసు తెలిపారు.

వైర్లనూ వదలడం లేదు..!

భైంసాటౌన్: పట్టణంలో చిల్లర చోరీలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల గుజిరిగల్లి, బ్రాహ్మణగల్లిలో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహనాల టైర్లను ఎత్తుకెళ్లారు. తాజాగా పంటచేలల్లో బోరు మోటార్ల వైర్లు సైతం చోరీకి గురయ్యాయి. పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డులోని పంట చేలల్లో నుంచి రాత్రివేళల్లో వైర్లు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ఇలా దాదాపు పది నుంచి పదిహే ను బోర్ల మోటారు వైర్లు చోరీకి గురైనట్లు తెలిపారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు.


భూమిలోపలి నుంచి బోరుకు ఉన్న వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం